# ప్రజా ముచ్చట

తెలుగు దినపత్రిక

మా ప్రతీ అక్షరం – ప్రజల ముచ్చటే



PM ప్రజా ముచ్చట
తెలుగు దిన పత్రిక

విలేకర్లు కావలెను

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ ఆర్.సి. ఇంఛార్జ్‌లు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.

అనుభవం, ఆసక్తిగలవారు 99086 89674 లో సంప్రదించగలరు



హైదరాబాద్ | శనివారం,మే10,2025 | ఎడిటర్: పండ్ల నాగరాజు | పేజీలు: 4 వేల: 1




## భారత్‌లోని 36 సరిహద్దు ప్రాంతాలపై
# పాకిస్థాన్ డ్రోన్ల దాడి...

- 300-400 డ్రోన్లతో గురువారం రాత్రి దాడులకు పాల్పడిన పాక్
- భారత సైనిక స్థావరాలు, ప్రార్థనా మందిరాలే లక్ష్యంగా దాడులు
- పౌర విమానాలను రక్షణ కవచంగా పాక్ వాడుతోందని భారత్ ఆరోపణ
- ఈ దాడుల వెనుక భారత గగనతల రక్షణ వ్యవస్థలను పరీక్షించడం, నిఘా

భారత్‌లోని కీలక సరిహద్దు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని పాకిస్థాన్ గురువారం రాత్రి భారీ స్థాయిలో డ్రోన్ల దాడికి పాల్పడిందని భారత ప్రభుత్వం వెల్లడించింది. జమ్ముకశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల్లోని సుమారు 36 ప్రాంతాలపై 300 నుంచి 400 డ్రోన్లను ప్రయోగించిందని భారత సైన్యం తెలిపింది. ఈ దాడుల వెనుక భారత గగనతల రక్షణ వ్యవస్థలను పరీక్షించడం, నిఘా సమాచారాన్ని సేకరించడమే పాక్ ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొంది.'ఆపరేషన్ సిందూర్'కు సంబంధించిన వివరాలను వెల్లడించేందుకు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, కల్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లు ఈ సంచలన విషయాలను తెలిపారు.గురువారం రాత్రి పాకిస్థాన్ కవ్వింపు చర్యలకు దిగి, నియంత్రణ రేఖ వెంబడి ఉల్లంఘనలకు పాల్పడుతూ భారత సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు ప్రారంభించిందని వారు వివరించారు. పాక్ వైపు నుంచి వచ్చిన అనేక డ్రోన్లను భారత బలగాలు కూల్చివేశాయని, ఈ ఘటనల్లో పలువురు గాయపడ్డారని వారు పేర్కొన్నారు. పంజాబ్ సరిహద్దుల్లో పూర్తి అప్రమత్తత కొనసాగుతోందని, పాక్ దాడులను భారత వాయుసేన సమర్థంగా అడ్డుకుందని తెలిపారు. దాడుల కోసం టర్కీకి చెందిన 'ఆసిస్‌గార్డ్ సోంగర్' రకం డ్రోన్లను పాకిస్థాన్ ఉపయోగించినట్లు ప్రాథమిక సమాచారం ద్వారా తెలిసిందన్నారు.ఈ దాడుల సందర్భంగా పాకిస్థాన్ తన పౌర విమానాలను రక్షణ కవచాలుగా వాడుకుందని భారత రక్షణ శాఖ ప్రతినిధులు తీవ్ర ఆరోపణలు చేశారు.

## కచ్, బనస్కంతా, పటాన్, జామ్‌నగర్ జిల్లాల్లో
# భద్రతా సన్నద్ధతపై ప్రధాని ఆరా

- పాక్‌తో యుద్ధం... గుజరాత్ ముఖ్యమంత్రికి ప్రధాని మోదీ ఫోన్
- గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌తో ప్రధాని నరేంద్ర మోదీ ఫోన్‌లో సంభాషణ
- పౌరుల భద్రతకు తీసుకుంటున్న చర్యల గురించి వివరాలు అడిగి తెలుసుకున్న ప్రధాని



న్యూఢీల్లీ,మే9, భారత్, పాకిస్థాన్ మధ్య సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు తీవ్రమవుతున్న నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భద్రతా సన్నద్ధతపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలో ఆయన గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌తో ఫోన్‌లో మాట్లాడి తాజా పరిస్థితులపై సమీక్షించారు. పాకిస్థాన్ వైపు నుంచి కవ్వింపు చర్యలు, డ్రోన్లు, క్షిపణుల ద్వారా దాడుల ప్రయత్నాలు జరుగుతున్నాయన్న నివేదికల నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది.పాకిస్థాన్‌తో సుదీర్ఘ సరిహద్దును పంచుకుంటున్న గుజరాత్‌లో భద్రతా ఏర్పాట్లపై ప్రధాని మోదీ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా భద్రతాపరంగా అత్యంత సున్నితమైనవిగా పరిగణించే కచ్, బనస్కంతా, పటాన్, జామ్‌నగర్ జిల్లాల్లో ప్రస్తుత పరిస్థితిని, పౌరుల భద్రత నిమిత్తం రాష్ట్ర యంత్రాంగం చేపడుతున్న చర్యలను ప్రధాని అడిగి తెలుసుకున్నారు.పాకిస్థాన్ నుంచి దాడుల ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ఈ సరిహద్దు జిల్లాల్లో అధికార యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా వ్యవహరిస్తోందని, ప్రజలకు ఎప్పటికప్పుడు అవసరమైన సూచనలు జారీ చేస్తోందని ముఖ్యమంత్రి ప్రధానికి వివరించారు.

## ఉగ్రవాదుల చొరబాటుయత్నం.. ఏడుగురి కాల్చివేత..

న్యూఢీల్లీ,మే9,(భారత్, పాక్ ఉద్రిక్తతల వేళ సరిహద్దుల్లో భారీ చొరబాటుయత్నాన్ని బీఎస్ఎఫ్ బలగాలు సమర్థవంతంగా అడ్డుకున్నాయి. సైనిక వర్గాల సమాచారం ప్రకారం.. శుక్రవారం తెల్లవారుజామున సాంబ సెక్టార్ లో భారీ సంఖ్యలో ఉగ్రవాదులు భారత భూభాగంలోకి చొరబడేందుకు ప్రయత్నించారు. సర్వేలెన్స్ కెమెరాల ద్వారా ఈ విషయం గుర్తించిన బీఎస్ఎఫ్ బలగాలు వెంటనే అప్రమత్తమయ్యాయి. ఉగ్రవాదులపై కాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో ఏడుగురు ఉగ్రవాదులు హతమయ్యారని సమాచారం. బీఎస్ఎఫ్ బలగాల కాల్పుల్లో పాక్ సైనిక పోస్ట్ ధ్వంసమైందని తెలుస్తోంది. అయితే, మృతుల సంఖ్యపై బీఎస్ఎఫ్ ఇప్పటి వరకు అధికారికంగా ప్రకటన చేయలేదు. కాగా, ఉగ్రవాదుల కదలికలకు సంబంధించి సర్వేలెన్స్ కెమెరా ఫుటేజీని భద్రతా




బలగాలు సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో ఆ వీడియో ప్రస్తుతం వైరల్ గా మారింది.



## పాక్ తో ఉద్రిక్తతల కారణంగా సీఏ పరీక్షలు
# వాయిదా

మే9,() పాకిస్థాన్ తో యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో చార్టర్డ్ అకౌంటెంట్ (సీఏ) పరీక్షలన్నీ వాయిదా వేస్తున్నట్లు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) ప్రకటించింది. ముందుగా విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం.. మే 9 నుంచి 14 వరకు సీఏ ఇంటర్మీడియట్, ఫైనల్, పోస్ట్ క్వాలిఫికేషన్ పరీక్షలు జరగాల్సి ఉంది. గ్రూప్ 1 అభ్యర్థులకు సీఏ ఇంటర్ పరీక్ష మే 3, 5, 7 తేదీలలో జరగాల్సి ఉండగా.. గ్రూప్ 2 పరీక్షలు మే 9, 11, 14 తేదీల్లో జరగాల్సి ఉంది. అయితే, దేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ఈ పరీక్షలను వాయిదా వేయాలని నిర్ణయించినట్లు ఐసీఏఐ వెల్లడించింది. తిరిగి ఎప్పుడు నిర్వహించనున్నది త్వరలో తెలియజేస్తామని పేర్కొంది. పరీక్షకు నమోదు చేసుకున్న అభ్యర్థులు ఐసీఏఐ వెబ్‌సైట్ %ఆఝఆ.శీతీస్త్ర%లో అధికారిక నోటీసును తనిఖీ చేసుకోవాలని సూచించింది.



## హై అలర్ట్‌లోనే ఢిల్లీ...

### ప్రభుత్వ ఉద్యోగుల సెలవులు రద్దు

న్యూఢీల్లీ,మే9,( ఆపరేషన్ సిందూర్ తర్వాత దాయాది పాకిస్థాన్ వక్రబుద్ధితో భారత్‌పై డ్రోన్, క్షిపణి దాడులకు పాల్పడుతున్న విషయం తెలిసిందే. దీంతో ఇరుదేశాల మధ్య ఉద్రితక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలోనే ఢిల్లీలో హై అలర్ట్ ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగుల సెలవులు రద్దు అయ్యాయి. అత్యవసర పరిస్థితిని ఎదుర్కొనేలా వైద్య, విపత్తు నిర్వహణ విభాగాల సంసిద్ధతను సమీక్షిస్తున్నారు. పోలీసులు అప్రమత్తంగా ఉన్నారు. సున్నితమైన ప్రాంతాలలో అదనపు బలగాలను మోహరిస్తున్నాం. రాత్రిపూట నిఘా ముమ్మరం చేశాం" అని అధికారులు తెలిపారు. ఇక, ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో ఇప్పటికే దేశంలో 24 విమానశ్రయాలు తాత్కాలికంగా మూసివేశారు. అలాగే దేశ రాజధానికి రాకపోకలు కొనసాగించే పలు విమానాలను క్యాన్సిల్ చేశారు. ఇండియా గేట్ వద్ద ట్రాఫిక్‌ను నియంత్రించడంతో పాటు ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయాలని స్థానికులను అధికారులు ఆదేశించారు.

## జాతీయ రక్షణ నిధికి నెల వేతనం
# విరాళంగా ఇవ్వాలి

- భారత సైన్యానికి మద్దతుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడి
- కాంగ్రెస్ సభ్యుల విరాళంపై చర్చించి ప్రకటించనున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ఇతర పార్టీల ప్రజాప్రతినిధులు కూడా సహకరించాలని సీఎం రేవంత్ విజ్ఞప్తి



హైదరాబాద్,మే9, భారత్, పాకిస్థాన్ సరిహద్దుల వెంబడి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక కీలక నిర్ణయాన్ని ప్రతిపాదించారు. దేశ రక్షణలో నిమగ్నమైన భారత సైన్యానికి సంఘీభావం తెలిపే దిశగా ఆయన ఈ చొరవ తీసుకున్నారు.పాకిస్థాన్ దుందుడుకు చర్యలను ధైర్యంగా ఎదుర్కొంటున్న భారత సైనిక దళాలకు అండగా నిలవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ క్రమంలో, రాష్ట్రంలోని శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు తమ ఒక నెల వేతనాన్ని జాతీయ రక్షణ నిధి (నేషనల్ డిఫెన్స్ ఫండ్)కి విరాళంగా అందించాలని ఆయన సూచించారు.ఈ ప్రతిపాదనపై కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చర్చలు జరిపి, ఆ పార్టీ తరఫున విరాళంపై అధికారిక ప్రకటన చేయనున్నారు. అంతేకాకుండా, ఈ విషయంలో రాజకీయాలకు అతీతంగా స్పందించాలని, ఇతర రాజకీయ పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విరాళాలు అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.




## శంషాబాద్ విమానాశ్రయానికి
# బాంబు బెదిరింపు

- అప్రమత్తమైన పోలీసులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది
- డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ బృందాలతో సోదాలు
- బెదిరింపు ఈ-మెయిల్ మూలాలపై అధికారుల విచారణ

హైదరాబాద్,మే9,( హైదరాబాద్‌లోని శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కలకలం రేగింది. విమానాశ్రయంలో బాంబు అమర్చినట్లు గుర్తుతెలియని వ్యక్తుల నుంచి అధికారులకు ఈ-మెయిల్ ద్వారా బెదిరింపు సందేశం అందింది. ఈ సమాచారంతో అప్రమత్తమైన విమానాశ్రయ అధికారులు, భద్రతా సిబ్బంది వెంటనే తనిఖీలు చేపట్టారు.

## హంద్రీనీవా నీటి విడుదలకు ముహూర్తం ఖరారు

రాయలసీమ ప్రాంతానికి జీవనాడి అయిన హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు ద్వారా జూలై 10వ తేదీన నీటిని విడుదల చేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గంలోని చాయాపురంలో హంద్రీనీవా



పనులను నేడు క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం ఏర్పాటు చేసిన ప్రజావేదికలో ఆయన ప్రసంగించారు. ప్రాజెక్టులో ఫేజ్-1, ఫేజ్-2 కింద చేపడుతున్న 554 కిలోమీటర్ల కాలువ లైనింగ్, వెడల్పు పనుల కోసం ప్రభుత్వం రూ.3,873 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు.

## పాక్‌తో ఉద్రిక్తతల వేళ సైన్యానికి పవన్ మద్దతు..

పాకిస్థాన్‌తో సరిహద్దుల్లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో, భారత సైనిక దళాలకు మద్దతుగా నిలవాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. భారత బలగాలు శత్రుదేశంపై చేపడుతున్న 'ఆపరేషన్ సిందూర్' ఒక ధర్మయుద్ధమని అభివర్ణించిన ఆయన, ఈ ఆపరేషన్ విజయవంతం కావాలని, దేశానికి నాయకత్వం వహిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, సైన్యానికి దైవబలం, ఆశీస్సులు లభించాలని ఆకాంక్షిస్తూ ప్రతి ఒక్కరూ ప్రార్థనలు చేయాలని కోరారు.

# 81 జీవో ప్రకారం వీఆర్ఏ వారసులకులకు ఉద్యోగాలు వెంటనే ఇవ్వాలి

**- టి ఎన్ టి యు సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి**

హుజూర్ నగర్,ప్రజా ముచ్చట:సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ లో వీఆర్ఏల రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది పూర్వం వీఆర్ఏల గౌరవ అధ్యక్షులు టి ఎన్ టి యు సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి మాట్లాడుతూ జీవో నెంబర్ 81 ప్రకారంగా 61 సంవత్సరాలు పైబడిన వీఆర్ఏ కుటుంబాలకు వారసులకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని గత ప్రభుత్వం తీసుకొచ్చిన జి లో ప్రకారం రెగ్యులర్ చేస్తామని తీసుకొచ్చిన ఈ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ అమలు చేయకపోవడం అన్యాయమని అన్నారు వీఆర్ఏల తమ పేస్కేల్ కోసం పోరాడుతున్నప్పుడు అప్పటి పిసిసి అధ్యక్షుడిగా ఉన్న రేవంత్ రెడ్డి తమ పోరాటానికి మద్దతు తెలిపి న్యాయమైన సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 16 నెలలు అయింది వీఆర్ఏలు సమస్యలు పరిష్కారానికి ఒక్క కమిటీని వేసిన ప్రభుత్వం 13 నెలలు గడిచిన అతిగతి లేదని విమర్శించారు వీఆర్ఏ కుటుంబాలకు వారసులు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారని ప్రభుత్వం వెంటనే వీరికి ఉద్యోగాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మొత్తం మీద 20 వేల మంది వీఆర్ఏలు ఉండగా అందులో 16000 మందిని రెగ్యులర్ చేసినారని మిగిలినవారికి ఇంతవరకు పర్మిట్ చేయలేదని 2014 సంవత్సరం నుండి చనిపోయిన విఆర్ఎ ల వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు ఇటీవల జరిగిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో రెవిన్యూ మంత్రి భూభారతి తెచ్చిన అనంతరం వీరిని పర్మనెంట్ చేస్తామని అన్నారని వెంటనే మాట నిలబెట్టుకోవాలని కోరారు ఈనెల 20,న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెలో విఆర్ఎ లు పాల్గొని



విజయవంతం చేయాలని కోరారు వీఆర్ఏ రాష్ట్ర నాయకులు లక్ష్మీ మల్ల నరసింహారావు చెన్నయ్య సతీష్ దుర్గారావు వెంకన్న తదితరులు పాల్గొన్నారు

# మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ఇందిరా మహిళా శక్తి పథకం

పెన్ పహాడ్/ ప్రజా ముచ్చట, మే 09: మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకంను అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిందని ఈ పథకాన్ని ఉపయోగించుకొనిమహిళలు ముందుకు వెళ్లాలని తహశీల్దార్ లాలు నాయక్ అన్నారు. ఈ పథకంలో భాగంగా సంఘ బంధం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నారీ టీ స్టాల్ ను శుక్రవారం తహసిల్దార్ ధరావతు లాలు నాయక్, ఎంపీడీవో జే. వెంకటేశ్వర్లు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకే పలు పథకాలను ప్రవేశ పెట్టాయని వాటిని మహిళలు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం అజయ్ నాయక్, ఈసీ మహేష్, ఏక స్వామి, లబ్ధిదారులు మేకల రమణ, సెర్ఫ్ సిబ్బంది స్వరూప, పద్మావతి ఆశ, జ్యోతి, లత, విజయ, పౌల్, సైదులు, హుస్సేన్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ ప్రభుత్వం 'ఆపరేషన్ చేయూత' ఎఫెక్ట్... 38 మంది మావోయిస్టుల లొంగుబాటు

**- ఛత్తీస్‌గఢ్‌లో వివిధ కేడర్లలో పనిచేసిన సభ్యులు**
**- లొంగిపోయినవారికి తక్షణ ఆర్థిక సహాయం అందజేత**
**- ఈ ఏడాది ఇప్పటివరకు 265 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు పోలీసులు వెల్లడి**
**- నిషేధిత సీపీఐ-మావోయిస్టు పార్టీకి చెందిన 38 మంది సభ్యులు**
**- ఛత్తీస్‌గఢ్‌లో వివిధ హెూదాల్లో పనిచేస్తున్న వీరు జనజీవన స్రవంతిలో కలిసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు.**



తెలంగాణ ప్రభుత్వ కల్పిస్తున్న పునరావాస విధానాలు, శాంతియుత జీవనంపై ఆశతో, నిషేధిత సీపీఐ-మావోయిస్టు పార్టీకి చెందిన 38 మంది సభ్యులు శుక్రవారం నాడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఛత్తీస్‌గఢ్‌లో వివిధ హెూదాల్లో పనిచేస్తున్న వీరు జనజీవన స్రవంతిలో కలిసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఎదుట ఈ 38 మంది మావోయిస్టులు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో ఇద్దరు పార్టీ సభ్యులు, 16 మంది మిలీషియా సభ్యులు, ఏడుగురు గ్రామ కమిటీ సభ్యులు, ఆరుగురు క్రాంతికారి ఆదివాసీ మహిళా సంఘటన్ సభ్యులు, ముగ్గురు చేతన నాట్యమంచ్ సభ్యులు, నలుగురు గెరిల్లా రివల్యూషనరీ డిస్ట్రిక్ట్స్ సభ్యులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. లొంగిపోయిన వారికి పునరావాసం నిమిత్తం ప్రభుత్వం తరపున తక్షణ ఆర్థిక సహాయంగా చెక్కులను ఎస్పీ అందజేశారు.తెలంగాణ ప్రభుత్వం లొంగిపోయిన మావోయిస్టుల సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ సంయుక్తంగా గిరిజన ప్రాంతాల్లో చేపడుతున్న 'ఆపరేషన్ చేయూత' వంటి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి తెలుసుకున్న వీరు, మావోయిజం మార్గాన్ని వీడి, తమ కుటుంబ సభ్యులతో ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని నిర్ణయించుకున్నారని ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు.ప్రభుత్వం కల్పిస్తున్న పునరావాస సౌకర్యాలకు ఆకర్షితులై వివిధ కేడర్ల మావోయిస్టులు ఆయుధాలు వీడి లొంగిపోతున్నారని ఎస్పీ పేర్కొన్నారు. లొంగిపోయిన వెంటనే వారికి అందాల్సిన ప్రతిఫలాలను తెలంగాణ ప్రభుత్వం తరపున పోలీసులు అందజేస్తున్నారని వారు గ్రహించారని, ఇప్పటికే లొంగిపోయిన వారు ప్రభుత్వ సౌకర్యాలను పొందుతూ తమ కుటుంబాలతో శాంతియుత జీవితం గడుపుతున్నారని వివరించారు. ఈ ఏడాది ఇప్పటివరకు కొత్తగూడెం పోలీసుల ఎదుట 265 మంది మావోయిస్టు పార్టీ సభ్యులు లొంగిపోయినట్లు ఎస్పీ వెల్లడించారు.కొంతకాలంగా నిషేధిత సీపీఐ-మావోయిస్టు పార్టీ గిరిజనుల మద్దతు, విశ్వాసం కోల్పోయిందని, వారి కాలం చెల్లిన సిద్ధాంతాలతో ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్నారని ఎస్పీ ఆరోపించారు. ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధి చెందితే తాము మనగడ సాగించలేమని వారు భావిస్తున్నారని అన్నారు."అమాయక గిరిజనులు జీవనోపాధి కోసం నిత్యం తిరిగే ప్రాంతాల్లో ల్యాండ్‌మైన్లు అమర్చి వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. మావోయిస్టు పార్టీ నాయకుల దుశ్చర్యల వల్ల గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరు అమాయక గిరిజనులను పోలీసు ఇన్ఫార్మర్ల నెపంతో మావోయిస్టులు హత్య చేస్తున్నారు, హింసిస్తున్నారు" అని రోహిత్ రాజు తెలిపారు.జనజీవన స్రవంతిలో కలిసి సాధారణ జీవితం గడపాలనుకునే పార్టీ సభ్యులు తమ సమీపంలోని పోలీస్ స్టేషన్ లేదా జిల్లా ఉన్నతాధికారులను వారి కుటుంబ సభ్యుల ద్వారా గానీ, నేరుగా గానీ సంప్రదించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. లొంగిపోయిన పార్టీ సభ్యుల జీవనోపాధికి, పునరావాసానికి ప్రభుత్వం తరపున అన్ని రకాల ప్రయోజనాలు అందేలా జిల్లా పోలీసు యంత్రాంగం నిరంతరం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. "తెలంగాణ ప్రాంతానికి చెందిన అగ్రశ్రేణి మావోయిస్టు నాయకులు జనజీవన స్రవంతిలో కలవాలనుకుంటే, వారికి ప్రత్యేక నగదు పురస్కారాలు, ఇతర పునరావాస సౌకర్యాలు తక్షణమే అందించేందుకు పోలీసు శాఖ కృషి చేస్తుంది" అని ఆయన తెలిపారు.

# మిలిటరీ బడ్జెట్ పెంపు- పౌర సంక్షేమానికి కోత

డోనాల్డ్ ట్రంప్ పిచ్చి పనులతోనే కాదు, యుద్ధోన్మాదంతో కూడా రెచ్చిపోతున్నాడు. ఒకవైపు ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపుతానంటాడు, మరోవైపు గాజాలో మారణకాండకు మద్దతు, ఎమెన్‌పై ప్రత్యక్షంగా దాడులు జరిపిస్తాడు. ఇలాంటి దుర్మార్గాలకు మరింతగా పాల్పడేందుకు మిలిటరీ బడ్జెట్‌ను భారీగా పెంచేందుకు పూనుకున్నాడు. 2026 సంవత్సర బడ్జెట్‌లో మిలిటరీకి 13 శాతం పెంచి లక్ష కోట్ల డాలర్లకు చేర్చాలని, అందుకుగాను విద్య, వైద్యం, పర్యావరణం, ప్రజాసాయం, అదనపు పోషకాహార సాయ పథకం (మన ఉచిత బియ్యం వంటిది), బలహీన వర్గాల గృహ నిర్మాణం వంటి సంక్షేమ పథకాలకు కోత పెట్టాలని ప్రతిపాదించాడు. ఈ మేరకు అధ్యక్ష భవనం ఈనెల రెండవ తేదీన ఒక ముసాయిదా బడ్జెట్‌ను ఆవిష్కరించింది. ఈ కోతలు ఇంకా పెరగవచ్చు. ప్రపంచ కుబేరుడు ఎలన్ మస్క్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ సామర్థ్య శాఖ (డోజె) ఇప్పటికే పెద్ద ఎత్తున ఉద్యోగులను తొలగించి, ఉద్యోగాలకు కోత పెట్టి పొదుపు చర్యలంటూ అనేక సంస్థలకు నిధుల కోతకు పాల్పడింది. బడ్జెట్‌లో రెండు రకాలు ఉంటాయి. విధిగా కేటాయింపులు జరపాల్సినవి, విచక్షణతో అమలు జరపాల్సినవి. రెండో రకం పథకాల మొత్తం వచ్చే ఏడాది 1.7 లక్షల కోట్ల డాలర్లు ఉంటుందని, వర్తమాన బడ్జెట్‌తో పోలిస్తే 7.6 శాతం కోత విధించినట్లని చెబుతున్నారు. ఇవి ప్రధానంగా సంక్షేమ పథకాలకు చెందినవే.అమెరికా రాజ్యాంగం ప్రకారం బడ్జెట్ మీద అధికారం పార్లమెంటుదే, అయితే నిబంధనల మేరకు అధ్యక్ష భవనం తన వాంఛలను తెలియచేస్తూ పార్లమెంటుకు ప్రతిపాదనలు పంపాల్సి ఉంటుంది. అయితే వాటిని పార్లమెంటు ఆమోదించవచ్చు, తిరస్కరించవచ్చు, సవరించవచ్చు. అవి అధ్యక్షుడికి నచ్చకపోతే 1974లో సవరించిన చట్ట ప్రకారం తనకున్న అధికారాల ద్వారా ఉత్తర్వులు జారీ చేసి అమలు చేయవచ్చు.స్టాకహోమ్ ఇంటర్నేషనల్ పీస్ రిసర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సిప్రి) తాజాగా విడుదల చేసిన నివేదిక ప్రకారం 2024లో ప్రపంచ మిలిటరీ ఖర్చు 2.7 లక్షల కోట్ల డాలర్లని, దీనిలో మూడో వంతు అమెరికా ఖర్చు 997 బిలియన్ డాలర్లు అని పేర్కొన్నది. హిట్లర్ వారసురాలైన జర్మనీ అంతకు ముందు సంవత్సరంతో పోల్చితే 28 శాతం పెంచి 88.5 బి.డాలర్లు, మరో యుద్ధోన్మాది జపాన్ 21 శాతం పెంచి 55.3 బిలియన్ డాలర్లు ఖర్చు చేసింది. మిలిటరీ ఖర్చులో ఏడవ స్థానంలో ఉన్న జర్మనీ నాలుగుకు ఎగబాకింది. ఉక్రెయిన్‌పై యుద్ధం చేస్తున్న రష్యా 149 బి.డాలర్లు ఖర్చు చేస్తే ఎలాంటి దాడుల్లో ప్రత్యక్షంగా పాల్గొనని నాటో దేశాలు పది రెట్లు అదనంగా 1.5 లక్షల కోట్ల డాలర్లు ఖర్చు పెట్టాయి. మొత్తం ఖర్చు 2015లో ఉన్న 1.67 లక్షల కోట్ల డాలర్లతో పోలిస్తే 2024లో 2.7 లక్షల కోట్ల డాలర్లకు పెరిగింది. యుద్ధోన్మాదం లేదా మిలిటరీ ఖర్చు పెరుగుదల తీరు ముప్పును సూచిస్తున్నది. ఐరోపా మీద పెత్తనం చెలాయించాలని చూస్తున్న జర్మనీ యుద్ధ సన్నాహాలకు గాను అంటే మిలిటరీ అవసరాలకు సైతం ఉపయోగపడే విధంగా రోడ్లు, వంతెనలు, ఆసుపత్రుల వంటి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసేందుకు 1.13 లక్షల కోట్ల డాలర్లు ఖర్చు చేసేందుకు పూనుకుంది. ఇది మొదటి ప్రపంచ యుద్ధం తొలి ఏడాదిలో జర్మనీ చేసిన ఖర్చులో 8.6 శాతం కాగా రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు సంవత్సరం చేసిన ఖర్చుకు దగ్గరలో ఉందని పోలికలు వెల్లడిస్తున్నాయి. ఈ ప్రయత్నాలన్నీ యుద్ధ పరిశ్రమలు ముఖ్యంగా అమెరికా సంస్థలకు లబ్ధి చేకూర్చేందుకు దోహదం చేస్తున్నాయి. సిప్రి అంచనా ప్రకారం 2023లో ఆయుధ తయారీలో అగ్రభాగాన ఉన్న 100 కంపెనీలు 632 బిలియన్ డాలర్ల మేర విక్రయించగా ఒక్క అమెరికా ఉత్పత్తిదారులకే 317 బిలియన్ డాలర్లు దక్కాయిఅమెరికా తన ప్రయోజనాలకే ఎప్పుడూ పెద్ద పీట వేస్తుందని ఐరోపాకు తెలిసినప్పటికీ గతంలో తగిలిన ఎదురుదెబ్బల కారణంగా దానితో జూనియర్ భాగస్వామిగా కలసి ప్రయాణిస్తున్నది. స్వతంత్ర పాత్ర పోషించేందుకు ఐరోపా సమాఖ్య, ఉమ్మడి కరెన్సీని కూడా ఏర్పాటు చేసుకుంది. రెండూ దాగుడు మూతలాడుతున్నాయి. మొత్తం మీద చూసినపుడు మిత్ర వైరుధ్యాలు పెరుగుతున్నాయి తప్ప తగ్గటం లేదు. కాగల కార్యం గంధర్వులు తీర్చినట్లు తాము చేయలేని పనిని చైనా చేయటాన్ని గమనిస్తున్నాయి. అయితే దానితో చేతులు కలిపే అవకాశం లేదు గనుక దాన్ని చూపి అమెరికాతో బేరమాడుతున్నాయి.అమెరికాకే అగ్రస్థానం' పేరుతో డోనాల్డ్ ట్రంప్ ఎజెండాను ముందు పెట్టిన తరువాత కొన్ని సందర్భాలలో ప్రతిఘటిస్తామని చెప్పటం తాజా పన్నుల యుద్ధంలో చూశాం. ఈ విషయంలో ట్రంప్ వెనక్కు తగ్గినా అలాంటి కత్తి వేలాడుతూనే ఉంటుంది గనుక ఐరోపా తన రక్షణ తానే చూసుకొనేందుకు పూనుకోవటం ఖాయం. దాన్లో భాగమే జర్మనీ పెద్ద మొత్తంలో మిలిటరీ ఖర్చుకు పూనుకోవటం. ఇరవై ఏడు దేశాల ఐరోపా సమాఖ్య 800 బిలియన్ యూరోల మిలిటరీ ఖర్చు అదనంగా చేసేందుకు నిర్ణయించింది. ఐరోపా జనాభాలో 24 శాతం మంది దారిద్ర్య రేఖకు దిగువున ఉన్నప్పటికీ ఈ ఖర్చు చేయటాన్ని గమనించాలి.

# అర్హులైన జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

**- ఈ నెల చివరిలోగా ప్రెస్ అకాడెమీ భవనం ప్రారంభిస్తాం**
**- రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

పాలేరు, మే 09,అర్హులైన జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాలలో నిరుపేదలైన జర్నలిస్టులకు అలాగే వృత్తి నిర్వహణలో చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తామని తెలిపారు.వృత్తి నిర్వహణలో చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు నెలసరి పెన్షన్, తీవ్ర అనారోగ్యం, ప్రమాదాలకు గురై వృత్తి నిర్వహించలేని స్థితిలో ఉన్న జర్నలిస్టులకు శుక్రవారం నాడు నాంపల్లి లోని ప్రెస్ అకాడమీ కార్యాలయంలో చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ మండల, నియోజకవర్గ స్థాయిలో పని చేస్తున్న జర్నలిస్టులను ఆదుకోవడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. మంచిని మంచిగా, నిజాన్ని నిర్భయంగా సమాజానికి తెలియజేసే దాంట్లో ఎంతో మంది జర్నలిస్టులు ఆణిముత్యాలుగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. జర్నలిస్టు వృత్తిని నమ్ముకుని తన జీవితం మొత్తం ఆ వృత్తికే అంకితం అయినవాళ్ళు ఎంతోమంది ఉన్నారని అన్నారు. ఆనాటి ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన ప్రెస్ అకాడమీ భవనాన్ని చిన్న చిన్న మరమత్తులు పూర్తి చేసుకుని ఈ నెల చివరిలోగా ప్రారంభిస్తామని తెలిపారు.విడతల వారీగా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.42.00 కోట్లను ఫిక్సడ్ డిపాజిట్ చేసి, దానిపై వచ్చే వడ్డీని జర్నలిస్టుల సంక్షేమం కోసం అకాడమి ఖర్చు పెడుతుందని. జర్నలిస్టుల సంక్షేమానికి ఫిక్స్ డిపాజిట్ పై వచ్చిన వడ్డీ ఆధారంగా ఇప్పటివరకు రూ.22 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు.



## విజయ్ దేవరకొండకు ఆలస్యంగా విషెస్ చెప్పిన రష్మిక మందన్న

టాలీవుడ్ సెన్సేషనల్ స్టార్ విజయ్ దేవరకొండ శుక్రవారం తన 36వ జన్మదినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా, ఆయన సన్నిహితురాలిగా పేరుపొందిన నటి రష్మిక మందన్న సోషల్ మీడియా వేదికగా ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.
విజయ్ దేవరకొండ పుట్టినరోజు సందర్భంగా, నటి రష్మిక మందన్న ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో ఆయన మనోహరమైన చిత్రాన్ని పంచుకుంటూ తన ఆకాంక్షలను వ్యక్తం చేశారు. "నేను మళ్లీ చాలా ఆలస్యం చేశాను. అయినా, హ్యాపీయెస్ట్ బర్త్‌డే విజ్జు. నీ రోజులు ఆశీస్సులు, ప్రేమ, సంతోషం, ఆరోగ్యం, సంపద, శాంతి, ఇంకా అన్నింటితో నిండి ఉండాలని కోరుకుంటున్నాను" అని రష్మిక పేర్కొన్నారు. వీరిద్దరూ డియర్ కామ్రేడ్, గీతగోవిందం సినిమాలలో కలిసి నటించిన విషయం తెలిసిందే.రష్మిక, విజయ్ తమ మధ్య ఉన్న సంబంధం గురించి అధికారికంగా ఎప్పుడూ ప్రకటించనప్పటికీ, వారిద్దరూ డేటింగ్‌లో ఉన్నారని అభిమానులు, నెటిజన్లు బలంగా నమ్ముతున్నారు. సోషల్ మీడియాలో ఒకరికొకరు ఇలాంటి ప్రేమపూర్వక సందేశాలు పంచుకోవడం, ఒకే సమయంలో విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు వారి చిత్రాల నేపథ్యాలు ఒకేలా ఉండటంతో ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూరుతోంది. గత ఏప్రిల్‌లో రష్మిక తన 29వ పుట్టినరోజు వేడుకల కోసం ఒమన్‌కు వెళ్లినప్పుడు, విజయ్ కూడా విదేశాల్లో పర్యటించిన్నట్లు వార్తలు వచ్చాయి. వారి సోషల్ మీడియా చిత్రాల బ్యాక్‌డ్రాప్‌లు ఒకేలా ఉండటాన్ని నెటిజన్లు గమనించారు.ఇదిలా ఉండగా, తాజా సమాచారం ప్రకారం, విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న మరోసారి రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వంలో తెరకెక్కనున్న '%ఎఱ%14' చిత్రంలో కలిసి నటించనున్నారని తెలుస్తోంది. విజయ్ పుట్టినరోజును పురస్కరించుకుని, ఈ సినిమా నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. "దేవుళ్ళ అతనికి బలాన్ని ఇచ్చారు. యుద్ధం అతనికి ఒక లక్ష్యాన్ని ఇచ్చింది. టీమ్ చ%ఎఱ%14 తరపున విజయ్ దేవరకొండకు పుట్టినరోజు శుభాకాంక్షలు" అని మైత్రీ మూవీ మేకర్స్ తమ అధికారిక ఎక్స్ ఖాతాలో పేర్కొంది.ఈ ఫస్ట్ లుక్‌లో విజయ్ ఒక ప్రార్థనా స్థలంలో ప్రశాంతంగా ధ్యానం చేస్తున్నట్లు కనిపిస్తున్నారు. కేవలం ధోతీ ధరించి, కెమెరాకు వీపు చూపిస్తూ కూర్చున్న ఆయన వీపుపై అనేక గాయాల గుర్తులు, మామూలు కంటే పొడవాటి జుట్టుతో కనిపించారు. ఈ లుక్‌ను బట్టి, విజయ్ ఈ చిత్రంలో పూర్తిగా కొత్త అవతారంలో కనిపించనున్నట్లు స్పష్టమవుతోంది.ప్రస్తుతం విజయ్ దేవరకొండ 'కింగ్‌డమ్' అనే మరో భారీ బడ్జెట్ సినిమా విడుదల కోసం ఎదురుచూస్తున్నారు. మరోవైపు రష్మిక మందన్న 'తమా', 'కుబేర', 'ది గర్ల్‌ఫ్రెండ్', 'రెయిన్‌బో' వంటి పలు చిత్రాలతో బిజీగా ఉన్నారు.

## ఉగ్రవాదులను చంపుతుంటే మీకేంటి బాధ..

### -మతం చూసి దాడులు చేసినప్పుడు ఎక్కడున్నారు?: ఘునందన్ రావు ఆగ్రహం

ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ, వారికి మద్దతు పలికే శక్తులపై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు తీవ్రంగా విరుచుకుపడ్డారు. భారత్ నిజంగా యుద్ధానికి సిద్ధపడితే ప్రపంచ పటం నుంచి పాకిస్థాన్ అదృశ్యమవుతుందని ఆయన హెచ్చరించారు. ప్రధాని నరేంద్ర మోదీ శాంతిని కోరుకుంటున్నందునే ఇన్ని రోజులుగా యుద్ధ వాతావరణం తలెత్తలేదని, దేశం గొప్ప సంయమనం పాటిస్తోందని అన్నారు.ఖమ్మం జిల్లాలో నిర్వహించిన 'వన్ నేషన్ వన్ ఎలక్షన్' కార్యక్రమంపై అవగాహన సదస్సులో పాల్గొన్న సందర్భంగా రఘునందన్ రావు ఈ వ్యాఖ్యలు చేశారు. గత మూడు రోజులుగా 'ఆపరేషన్ సింధూర్' పేరిట ధర్మయుద్ధం జరుగుతుంటే, ఈ దేశంలోనే ఉంటూ కొందరు దానిని విమర్శిస్తున్నారని మండిపడ్డారు. వీరిలో కమ్యూనిస్టులు, వివిధ రంగుల జెండాలు కలిగిన నాయకులు, పాత్రికేయుల ముసుగులో కొందరు అర్థం లేని వ్యాఖ్యలు చేస్తున్నారని దుయ్యబట్టారు."ఉగ్రవాదులను హతమారుస్తుంటే వీరికి ఎందుకు అంత బాధ? మతం చూసి మరీ దాడులు చేస్తుంటే ఈ మేధావులు ఎక్కడ ఉన్నారు? నిరంతరం హత్యలు జరుగుతుంటే చూస్తూ ఊరుకోవాలా?" అని రఘునందన్ రావు ప్రశ్నించారు. కాళ్లకు పారాణి ఆరకముందే సింధూరం కోల్పోయిన ఆడబిడ్డల ఆవేదనను ప్రస్తావిస్తూ, వారి ఆర్తనాదాల వల్లే ఇద్దరు మహిళలు ధర్మ యుద్ధానికి సారథ్యం వహించారని తెలిపారు.ఈ దాడుల్లో ఏ ఒక్క పాకిస్థానీ సామాన్యుడినీ లక్ష్యంగా చేసుకోలేదని, కేవలం ఉగ్రవాదుల స్థావరాల పైనే దాడులు జరిగాయని స్పష్టం చేశారు. దేశం చూపిస్తున్న సహనాన్ని చేతకానితనంగా భావిస్తే తగిన రీతిలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు.వాళ్లను ఎప్పుడు పంపించివేస్తున్నారు?రాష్ట్రంలో నివసిస్తున్న రోహింగ్యాలు, బంగ్లాదేశీయులు, పాకిస్థానీలను ఎప్పుడు పంపించివేస్తారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని రఘునందన్ రావు ప్రశ్నించారు. ర్యాలీలు నిర్వహించడం ద్వారా మద్దతు లభించదని, దేశ సార్వభౌమాధికారానికి వ్యతిరేకంగా మాట్లాడే ప్రభుత్వ ఉద్యోగులను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కొందరు ప్రొఫెసర్లు దేశ సంపదతో జీతాలు పొందుతూ ఉగ్రవాదుల పట్ల ప్రేమను ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. ఉగ్రవాదులకు మద్దతు పలికే వారందరూ దేశద్రోహులతో సమానమని, కన్నతల్లికి అన్నం పెట్టని వారే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## 'ఆపరేషన్ సిందూర్'పై స్పందించిన ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్

పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిగా భారత బలగాలు చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' విజయవంతం కావడంపై రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) సర్ సంఘ్‌చాలక్ మోహన్ భగవత్ హర్షం వ్యక్తం చేశారు. ఈ చర్య ద్వారా ఉగ్రవాదులకు గట్టి సమాధానం చెప్పిన భారత సైనిక దళాలను, కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన అభినందించారు. దేశ భద్రతను కాపాడే క్రమంలో పాకిస్థాన్‌పై కఠిన చర్యలు, అవసరమైతే దాడులు కూడా తప్పవని ఆయన అభిప్రాయపడ్డారు.కర్ణాటకలోని బెళగావిలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, పహల్గామ్‌లో అమాయక పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని ఒక హేయమైన, పిరికిపంద చర్యగా అభివర్ణించారు. దీనికి ప్రతిస్పందనగా చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' ద్వారా పాకిస్థాన్‌కు భారత్ సరైన రీతిలో బుద్ధి చెప్పిందని అన్నారు."ఈ ఆపరేషన్, పహల్గామ్ దాడి బాధితులకు న్యాయం చేయడమే కాకుండా, దేశ ప్రజల ఆత్మగౌరవాన్ని, ధైర్యాన్ని ఇనుమడింపజేసింది" అని పేర్కొన్నారు. ఉగ్రవాద నిర్మూలనకు భారత సైనిక బలగాలు తీసుకుంటున్న అన్ని చర్యలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.ఇలాంటి క్లిష్ట సమయాల్లో భారతీయులందరూ ఏకతాటిపై నిలిచారని, దేశం మొత్తం సైన్యానికి అండగా ఉందని మోహన్ భాగవత్ అన్నారు. భారత సరిహద్దుల్లోని దేవాలయాలు, పౌర నివాసాలపై పాకిస్థాన్ సైన్యం జరుపుతున్న దాడులను ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో, దేశ పౌరులందరూ ప్రభుత్వ మార్గదర్శకాలను, హెచ్చరికలను పాటించాలని సూచించారు. ఇలాంటి సమయాల్లోనే దేశ వ్యతిరేక శక్తులు పన్నే కుట్రలను సమర్థవంతంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. జాతీయ భద్రతను పరిరక్షించుకోవడానికి పౌరులందరూ సమష్టిగా కృషి చేయాల్సిన ఆవశ్యకతను ఆయన నొక్కిచెప్పారు.

## ఉద్రిక్తతల సమయంలో ఆటవిడుపు... సాంబ రిలీఫ్ క్యాంప్ లో క్రికెట్ ఆడిన సీఎం ఒమర్ అబ్దుల్లా

భారత్, పాకిస్థాన్ మధ్య సరిహద్దుల్లో ఉద్రిక్తతలు మరోసారి తీవ్రస్థాయికి చేరాయి. నిన్న రాత్రి ఇరు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్త వాతావరణం నేపథ్యంలో... పాకిస్థాన్ షెల్లింగ్ కారణంగా నష్టపోయిన జమ్మూకశ్మీర్‌లోని సరిహద్దు ప్రాంతాల పౌరుల కోసం అక్కడి ప్రభుత్వం సహాయక శిబిరాలను ఏర్పాటు చేసింది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో, జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా సాంబలోని సహాయక శిబిరంలో పర్యటించి, అక్కడ ఓ చిన్నారితో క్రికెట్ ఆడుతూ కొంత రిలాక్స్ అయ్యారు. బాధితులకు ధైర్యం చెబుతూ, ప్రభుత్వ అండదండలు ఎల్లప్పుడూ ఉంటాయని భరోసా ఇచ్చారు.సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సహాయక శిబిరాల గురించి విలేకరులతో మాట్లాడుతూ, శిబిరాల్లో ఉంటున్నంత కాలం పౌరులు తక్కువ సమస్యలను ఎదుర్కొనేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఒమర్ అబ్దుల్లా తెలిపారు."మేము చేయగలిగినదంతా చేస్తున్నాం. రోజుకు మూడు పూటలా ఆహారం అందిస్తున్నాం, పారిశుద్ధ్య సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి, అన్ని శిబిరాల్లో వైద్యులు అందుబాటులో ఉన్నారు, అంబులెన్స్‌లు ఏర్పాటు చేశాం... ఇక్కడ ఉండటం వల్ల వారు సాధ్యమైనంత తక్కువ సమస్యలను ఎదుర్కొనేలా చూస్తున్నాం" అని ఆయన వివరించారు. అంతకుముందు, పూంచ్‌లో జరిగిన పాకిస్థాన్ షెల్లింగ్‌లో గాయపడిన వారిని పరామర్శించేందుకు ముఖ్యమంత్రి జమ్మూలోని ప్రభుత్వ ఆసుపత్రికి కూడా వెళ్లారు.

## ఉద్యోగులను ఆశ్చర్యానికి గురిచేసిన చంద్రబాబు...

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలోని కీలక ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా, నేడు ఉరవకొండ నియోజకవర్గంలో హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ఆయన పర్యటన చేపట్టారు. ఈ పర్యటనలో, ప్రాజెక్టు పనులను నిశితంగా సమీక్షిస్తూనే, అక్కడ పనిచేస్తున్న అధికారులతో ఆయన వ్యవహరించిన తీరు వారిలో నూతనోత్సాహాన్ని నింపింది.హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు పనులను పరిశీలిస్తున్న సమయంలో, ముఖ్యమంత్రి చంద్రబాబు అక్కడ విధుల్లో ఉన్న ఇద్దరు అధికారులతో కాసేపు ముచ్చటించారు. ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక అంశాలు, పనుల వేగం, ఎదురవుతున్న సవాళ్ల గురించి వారితో చర్చించిన అనంతరం, వారి కుటుంబ సభ్యుల వివరాలు అడిగి తెలుసుకున్నారు."ఇంట్లో అందరూ బాగున్నారా? మీ పిల్లలు ఏం చేస్తున్నారు? వారి చదువులు ఎలా సాగుతున్నాయి? పెద్దవాళ్ల ఆరోగ్యం ఎలా ఉంది?" వంటి ప్రశ్నలతో ఆ ఇద్దరు అధికారులను సీఎం ఆప్యాయంగా పలకరించారు. కేవలం వృత్తిపరమైన విషయాలకే పరిమితం కాకుండా, ముఖ్యమంత్రి తమ వ్యక్తిగత యోగక్షేమాలను, కుటుంబ సభ్యుల బాగోగులను అడిగి తెలుసుకోవడం ఆ అధికారులను ఆశ్చర్యానికి గురిచేసింది. సీఎం ఆకస్మిక పలకరింపుతో వారు కొంత ఆశ్చర్యానికి లోనైనా, తమ పట్ల ముఖ్యమంత్రి చూపిన శ్రద్ధకు, ఆదరణకు ఉబ్బితబ్బిబ్బయ్యారు.సాధారణంగా ఉన్నతస్థాయి పర్యటనల సమయంలో అధికారిక అంశాలపైనే ప్రధానంగా దృష్టి సారించే చంద్రబాబు, ఇలా వ్యక్తిగత విషయాలపై ఆరా తీయడం అక్కడున్నవారికి కొత్త అనుభూతిని కలిగించింది. ఇది అధికారులలో మానసిక స్థైర్యాన్ని పెంచడమే కాకుండా, తాము కూడా ప్రభుత్వంలో కీలక భాగస్వాములమన్న భావనను కల్పించిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## బలూచిస్థాన్ నేత 'స్వాతంత్ర్య' ప్రకటన.. ఢిల్లీలో రాయబార కార్యాలయం కోసం భారత్‌కు విజ్ఞప్తి

పాకిస్థాన్‌లో ఒక కీలక పరిణామం చోటు చేసుకుంది. ప్రముఖ రచయిత మీర్ యార్ బలోచ్, బలూచిస్థాన్ ప్రాంతం పాకిస్థాన్ నుంచి స్వాతంత్ర్యం పొందినట్లు సంచలన ప్రకటన చేశారు. ప్రస్తుతం భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న సమయంలో ఈ ప్రకటన వెలువడటం ప్రాధాన్యతను సంతరించుకుంది.మీర్ యార్ బలోచ్ తన ప్రకటనలో పలు కీలక డిమాండ్లను అంతర్జాతీయ సమాజం ముందుంచారు. న్యూఢిల్లీలో బలూచిస్థాన్ రాయబార కార్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు భారత ప్రభుత్వం అనుమతించాలని ఆయన కోరారు. దీంతో పాటు, బలూచిస్థాన్‌లో శాంతిని నెలకొల్పేందుకు ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకోవాలని, తమ ప్రాంతానికి శాంతి పరిరక్షక దళాలను పంపించాలని విజ్ఞప్తి చేశారు. బలూచిస్థాన్ భూభాగం నుంచి పాకిస్థాన్ సైన్యం తక్షణమే వైదొలగాలని ఆయన డిమాండ్ చేశారు.దశాబ్దాలుగా బలూచిస్థాన్ ప్రజలు స్వాతంత్ర్యం కోసం పోరాటం చేస్తున్నారని, పాకిస్థాన్ ప్రభుత్వం తమ సహజ వనరులను దోచుకుంటూ, మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతోందని ఆయన గతంలో పలుమార్లు ఆరోపించారు.తాజా ప్రకటనతో బలూచ్ స్వాతంత్ర్య ఉద్యమానికి కొత్త ఊపు వచ్చినట్లయింది. భారత్-పాక్ సంబంధాలు ఉద్రిక్తంగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో, మీర్ యార్ బలోచ్ చేసిన ఈ ప్రకటనలు, ముఖ్యంగా భారత్ సహాయం కోరడం వంటి అంశాలు అంతర్జాతీయంగా చర్చనీయాంశమయ్యాయి. ఈ పరిణామాలపై పాకిస్థాన్ ప్రభుత్వం ఇంకా అధికారికంగా స్పందించలేదు.

## పఠాన్‌కోట్‌లో పాక్ డ్రోన్ దాడులు తిప్పికొట్టిన భారత్..

### -ఎవరూ బయటకు రావొద్దని ఒమర్ అబ్దుల్లా విజ్ఞప్తిజమ్ము,

సాంబా, పఠాన్‌కోట్?లపై పాకిస్థాన్ మరోసారి డ్రోన్ దాడులకు పాల్పడింది. పాకిస్థాన్ డ్రోన్ దాడిని భారత బలగాలు సమర్థంగా తిప్పికొట్టాయి. జమ్ము కశ్మీర్‌లోని ఉదంపూర్‌లో బ్లాకౌట్‌తో పాటు సైరన్ మోగింది.ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా విజ్ఞప్తిప్రజలెవరూ వీధుల్లోకి రావొద్దని జమ్ము కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ప్రజలకు సూచన చేశారు. జమ్ములో కాల్పులు, పేలుడు శబ్దాలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు."జమ్ము, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలందరికీ నా విజ్ఞప్తి. దయచేసి రాబోయే కొన్ని గంటల పాటు వీధుల్లోకి రావద్దు. మీ ఇళ్లలో లేదా సురక్షితమైన ప్రదేశాల్లో ఉండండి" అని ఒమర్ అబ్దుల్లా తన సందేశంలో పేర్కొన్నారు. సమాజంలో అనవసర ఆందోళనలు సృష్టించే వదంతులను నమ్మవద్దని, నిర్ధారణ లేని సమాచారాన్ని వ్యాప్తి చేయవద్దని ప్రజలను కోరారు. మనమంతా కలిసి ఈ పరిస్థితిని అధిగమిద్దామని ఆయన అన్నారు.

## భారత బలగాలకు రక్షణగా పవన్ కల్యాణ్ కీలక పిలుపు

పాకిస్థాన్‌తో సరిహద్దుల్లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో, భారత సైనిక దళాలకు మద్దతుగా నిలవాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. భారత బలగాలు శత్రుదేశంపై చేపడుతున్న 'ఆపరేషన్ సిందూర్' ఒక ధర్మయుద్ధమని అభివర్ణించిన ఆయన, ఈ ఆపరేషన్ విజయవంతం కావాలని, దేశానికి నాయకత్వం వహిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, సైన్యానికి దైవబలం, ఆశీస్సులు లభించాలని ఆకాంక్షిస్తూ ప్రతి ఒక్కరూ ప్రార్థనలు చేయాలని కోరారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.శత్రు సేనలను నిలువరించి, దేశాన్ని పరిరక్షించేందుకు అవసరమైన గొప్ప శక్తిసామర్థ్యాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మన త్రివిధ దళాలకు పుష్కలంగా ఉన్నాయని పవన్ కల్యాణ్ తన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ క్లిష్ట సమయంలో దేశమంతా సైనికుల కోసం ప్రార్థించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జనసేన పార్టీ తరపున రాబోయే మంగళవారం నాడు తమిళనాడులోని ఆరు ప్రసిద్ధ షణ్ముఖ క్షేత్రాలైన తిరుత్తణి, తిరుచెందూరు, పళని, తిరుపరంకుండ్రమ్, స్వామిమలై, పలముదిరచోళైలలో ప్రత్యేక పూజలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ప్రతి క్షేత్రానికి ఒక శాసనసభ్యుడిని, జన సైనికులను పంపించి పూజలు నిర్వహిస్తామని ఆయన వివరించారు.వీటితో పాటు, కర్ణాటకలోని కుక్కే సుబ్రహ్మణ్య, ఘాటీ సుబ్రహ్మణ్య క్షేత్రాల్లో... ఆంధ్రప్రదేశ్‌లోని మోపిదేవి, బిక్కవోలు సుబ్రహ్మణ్య ఆలయాల్లో, విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయంలో, పిఠాపురంలోని శ్రీ పురుహూతికా దేవి ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు పవన్ కల్యాణ్ వెల్లడించారు. అంతేకాకుండా, ఈ ఆదివారం శ్రీకాకుళం జిల్లా అరసవల్లిలోని శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయంలో, సైన్యానికి సూర్య శక్తి తోడుగా ఉండాలని ఆకాంక్షిస్తూ పూజలు చేయనున్నట్లు ఆయన తెలిపారు.రాష్ట్రంలోని ఇతర ప్రముఖ క్షేత్రాల్లో కూడా భారత సైన్యం కోసం, యుద్ధ వాతావరణం నెలకొన్న జమ్మూకశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్, హర్యాణా రాష్ట్రాల ప్రజల క్షేమం కోరుతూ పూజలు నిర్వహించాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. క్రైస్తవ విశ్వాసులు చర్చిలలో, ఇస్లాంను ఆచరించేవారు మసీదులలో తమ ప్రార్థనలు కొనసాగించాలని ఆయన సూచించారు. దేశ సమగ్రత, సార్వభౌమత్వం కోసం పోరాడుతున్న సైనికులకు ఆధ్యాత్మిక అండదండలు అందించడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఆయన గుర్తుచేశారు.

## ఏఆర్ రెహమాన్ పాటకు షాడో డ్యాన్స్... వీడియో వైరల్

ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ స్వరపరిచిన 'పూవుక్కుళ్' అనే తమిళ పాటకు చేసిన ఓ షాడో డ్యాన్స్ ప్రదర్శన ప్రస్తుతం ఇంటర్నెట్‌లో వైరల్ అవుతోంది. ఈ వీడియో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసినప్పటి నుంచి ఇప్పటివరకు 45.5 మిలియన్లకు పైగా (నాలుగున్నర కోట్లకు పైగా) వీక్షణలు సంపాదించి, నెటిజన్ల నుంచి విశేష ప్రశంసలు అందుకుంటోంది.ప్రముఖ కొరియోగ్రాఫర్ షోబి తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఈ వీడియోను పంచుకున్నారు. ఇందులో ఆయనతో పాటు ఓ మహిళా డ్యాన్సర్ కూడా పాల్గొన్నారు. వెలుతురు ప్రసరిస్తున్న ఓ కర్టెన్ వెనుక వీరిద్దరూ చేసిన ఈ నీడల నృత్యం అత్యంత సమన్వయంతో, సృజనాత్మకంగా, సాంకేతిక నైపుణ్యంతో ఆకట్టుకుంటోంది.ఈ క్లిప్‌లో, స్క్రీన్‌పై ఒకవైపు తెరవెనుక సన్నాహాలు కనిపిస్తాయి. డ్యాన్సర్ల మధ్య సమన్వయం, ప్రాపర్టీస్, లైటింగ్ సిబ్బంది పనితీరు స్పష్టంగా చూడొచ్చు. మరోవైపు, అందంగా రూపుదిద్దుకున్న షాడో డ్యాన్స్ ప్రదర్శన కనువిందు చేస్తుంది. వివిధ ఆకృతులలోకి మారడం నుంచి, నీడల రూపాలను ఊహాత్మకంగా మార్చే ప్రాప్స్ ఉపయోగించడం వరకు, ఈ ప్రదర్శన ఆద్యంతం అలరిస్తుంది. ప్రతీ కదలిక ఎంతో కచ్చితత్వంతో, సున్నితంగా ఉండటంతో వీక్షకులను కట్టిపడేస్తోంది.ఈ ప్రదర్శనపై నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. "ఇది కదిలే కవిత్వం" అని ఒకరు వ్యాఖ్యానించగా, "సృజనాత్మకత, టీమ్‌వర్క్‌కు ఇది ఒక మాస్టర్‌క్లాస్" అని మరొకరు పేర్కొన్నారు. డ్యాన్స్, థియేటర్‌ను అద్భుతంగా మిళితం చేసిన ఈ కాన్సెప్ట్ "ఓ విందు" అని ఓ యూజర్ అభిప్రాయపడ్డారు. "ఇంతకుముందెన్నడూ ఇంత అందమైన తెరవెనుక, తెరముందు కలయికను చూడలేదు" అని ఒకరు రాయగా, వారి సమన్వయం, వివరాలపై శ్రద్ధ దీనిని "కదిలే ప్రత్యక్ష చిత్రలేఖనం"లా మార్చాయని ఇంకొకరు ప్రశంసించారు.కాగా, 'పూవుక్కుళ్' పాట 1998లో విడుదలైన తమిళ చిత్రం 'జీన్స్' లోనిది. దీనికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందించగా, వైరముత్తు సాహిత్యం సమకూర్చారు.

## వారి ధైర్యసాహసాలకు మేం ఎప్పుడూ రుణపడి ఉంటాం: విరాట్ కోహ్లీ

భారత్, పాకిస్థాన్ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. నియంత్రణ రేఖ వెంబడి, పలు సరిహద్దు భారతీయ నగరాల్లో క్షిపణి దాడులు, వైమానిక దాడుల హెచ్చరికలు, సైనిక బలగాల కదలికలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ క్లిష్ట పరిస్థితుల్లో, భద్రతా కారణాల దృష్ట్యా ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2025 టోర్నమెంట్‌ను వారం రోజుల పాటు వాయిదా వేస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఈ క్రమంలో, భారత స్టార్ క్రికెటర్లు సైన్యం సేవలను కొనియాడారు.దేశ రక్షణలో నిరంతరం శ్రమిస్తున్న భారత సాయుధ దళాలకు వందనం చేస్తున్నట్లు విరాట్ కోహ్లీ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పేర్కొన్నారు. "మన గొప్ప దేశం కోసం మన హీరోలు, వారి కుటుంబాలు చేస్తున్న త్యాగాలకు, వారి అచంచలమైన ధైర్యసాహసాలకు మేమెప్పటికీ రుణపడి ఉంటాం" అని కోహ్లీ తన పోస్టులో రాసుకొచ్చారు. భారత జట్టు స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా, టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కూడా సైన్యానికి తమ సంఘీభావాన్ని తెలియజేశారు. "మనల్ని సురక్షితంగా ఉంచడానికి వారు చేస్తున్న అన్నింటికీ మేము వారికి వందనం చేస్తున్నాం. వారి ధైర్యసాహసాలకు కృతజ్ఞతలు. మేము వారికి ఎప్పటికీ రుణపడి ఉంటాం," అని బుమ్రా 'ఎక్స్ వేదికగా తెలిపారు. సూర్యకుమార్ యాదవ్ కూడా, "మన సైనిక బలగాల దృఢ సంకల్పం పట్ల ఎంతో గర్వంగా ఉంది. మీరు సరిహద్దుల్లో మమ్మల్ని కాపాడటంలో చూపించే బలం, దృఢ నిశ్చయానికి పెద్ద సెల్యూట్. మీ వల్లే మేము ఇళ్లలో సురక్షితంగా ఉంటున్నాం. మీకు ధన్యవాదాలు. జై హింద్" అని పోస్ట్ చేశారు.అంతకుముందు, భారత వన్డే జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ కూడా భారత సైన్యం, నౌకాదళం, వైమానిక దళం పట్ల గర్వంగా ఉందని, ప్రజలు నకిలీ వార్తలను ప్రచారం చేయకుండా దేశానికి మద్దతుగా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు.

# ఉద్రిక్తతలు ముదురుతున్న వేళ తమ్ముడికి కీలక సలహా ఇచ్చిన నవాజ్ షరీఫ్

పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ పరిణామాల అనంతరం భారత్, పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నిన్న రాత్రి పాకిస్థాన్ వందలాది డ్రోన్లతో భారత్‌పై దాడికి పాల్పడటంతో ఇరు దేశాల మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. పాక్ ప్రయోగించిన డ్రోన్లను భారత బలగాలు సమర్థవంతంగా కూల్చివేశాయి. ఈ సంక్లిష్ట పరిస్థితుల్లో పాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్... ప్రస్తుత ప్రధాని, తన సోదరుడు అయిన షెహబాజ్ షరీఫ్‌కు కీలకమైన సలహాలు అందించినట్లు తెలుస్తోంది. ఉద్రిక్తతలను తగ్గించడానికి దౌత్యపరమైన విధానాలను అనుసరించాలని ఆయన సూచించినట్లు 'ది ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్' ఒక కథనంలో వెల్లడించింది.పహల్గామ్ ఉగ్రదాడి ఘటన, భారత్ సింధు జలాల ఒప్పందాన్ని రద్దు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో లండన్‌లో ఉన్న నవాజ్ షరీఫ్ ఇటీవలే పాకిస్తాన్ తిరిగివచ్చారు. అణ్వస్త్ర శక్తి కలిగిన ఇరు దేశాల మధ్య శాంతిని పునరుద్ధరించేందుకు అందుబాటులో ఉన్న అన్ని దౌత్య మార్గాలను ఉపయోగించుకోవాలని ఆయన ప్రస్తుత ప్రధానికి సూచించినట్లు సమాచారం. గతంలో, 2023లో కూడా నవాజ్ షరీఫ్ మాట్లాడుతూ, భారత్‌తో సత్సంబంధాలు కొనసాగించాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. 1999లో కార్గిల్ యుద్ధాన్ని తాను వ్యతిరేకించినందువల్లే తన ప్రభుత్వాన్ని కూలదోశారని ఆయన ఆరోపించారు. 1999లో అప్పటి సైనిక పాలకుడు పర్వేజ్ ముషారఫ్ జరిపిన సైనిక తిరుగుబాటులో నవాజ్ షరీఫ్ ప్రభుత్వం కూలిపోయిన విషయం తెలిసిందే. తన ప్రభుత్వ హయాంలో, అప్పటి భారత ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శాంతి ఒప్పందం కుదుర్చుకోవడానికి లాహోర్ వచ్చారని, అయితే కార్గిల్ రూపంలో పాకిస్థాన్ ఆ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని నవాజ్ గతంలో వ్యాఖ్యానించారు. ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితుల్లో ఆయన చేసిన తాజా సూచనలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరగకుండా దౌత్యపరమైన చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని ఆయన గట్టిగా సూచించినట్లు తెలుస్తోంది.

# భారత్-పాకిస్థాన్ సరిహద్దుల్లో ఉద్రిక్తత.. సైన్యం కోసం సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం

భారత్, పాకిస్థాన్ సరిహద్దుల వెంబడి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక కీలక నిర్ణయాన్ని ప్రతిపాదించారు. దేశ రక్షణలో నిమగ్నమైన భారత సైన్యానికి సంఘీభావం తెలిపే దిశగా ఆయన ఈ చొరవ తీసుకున్నారు.పాకిస్థాన్ దుందుడుకు చర్యలను ధైర్యంగా ఎదుర్కొంటున్న భారత సైనిక దళాలకు అండగా నిలవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ క్రమంలో, రాష్ట్రంలోని శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు తమ ఒక నెల వేతనాన్ని జాతీయ రక్షణ నిధి (నేషనల్ డిఫెన్స్ ఫండ్)కి విరాళంగా అందించాలని ఆయన సూచించారు.ఈ ప్రతిపాదనపై కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చర్చలు జరిపి, ఆ పార్టీ తరఫున విరాళంపై అధికారిక ప్రకటన చేయనున్నారు. అంతేకాకుండా, ఈ విషయంలో రాజకీయాలకు అతీతంగా స్పందించాలని, ఇతర రాజకీయ పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విరాళాలు అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# యూరీ సెక్టార్‌లో మరోసారి పాకిస్థాన్ కాల్పులు

భారత్, పాకిస్థాన్ సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. జమ్ముకశ్మీర్‌లోని యూరి సెక్టార్‌లో నియంత్రణ రేఖ వెంబడి పాకిస్థాన్ దళాలు ఈ రోజు సాయంత్రం కాల్పులకు తెగబడ్డాయి. పాక్ సైన్యం చిన్నపాటి ఆయుధాలతో, ఫిరంగి గుండ్లతో భారత స్థావరాలపై దాడులు చేసింది. గత కొన్ని రోజులుగా పాకిస్థాన్ కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. తాజాగా యూరిలో కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది.మే 15 వరకు విమానాశ్రయాల మూసివేతఉత్తర, పశ్చిమ భారత్‌లోని విమానాశ్రయాలను మూసివేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. మే 15వ తేదీ వరకు పాక్ సరిహద్దు రాష్ట్రాల్లోని విమానాశ్రయాలను మూసివేయాలని నిర్ణయించారు. ఇప్పటికే పలు రాష్ట్రాలలో 24 విమానాశ్రయాలను మూసివేశారు.ఢిల్లీ ఎయిమ్స్ వైద్యుల సెలవులు రద్దుఢిల్లీ ఎయిమ్స్ వైద్యులు, సిబ్బంది, ఉద్యోగుల సెలవులను రద్దు చేస్తూ కేంద్ర ఆరోగ్య శాఖ నిర్ణయం తీసుకుంది. ఆరోగ్య కారణాలు మినహా ఎవరికీ సెలవులు మంజూరు చేయకూడదని నిర్ణయించింది. సెలవుల్లో ఉన్నవారి సెలవులను రద్దు చేస్తూ వెంటనే విధుల్లో చేరాలని ఆదేశించింది. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు సెలవుల రద్దు నిర్ణయం కొనసాగుతుందని ఆరోగ్య శాఖ వెల్లడించింది.

# ఘనంగా రష్యా విక్టరీ డే పరేడ్ ... పక్కపక్కనే కూర్చుని వీక్షించిన పుతిన్, జిన్ పింగ్

మాస్కోలోని రెడ్ స్క్వేర్‌లో శుక్రవారం రష్యా విక్టరీ డే సైనిక పరేడ్ అత్యంత వైభవంగా జరిగింది. రెండో ప్రపంచ యుద్ధంలో నాజీ జర్మనీపై సోవియట్ యూనియన్ సాధించిన విజయానికి 80వ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన ఈ వేడుకలకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ సహా పలు మిత్రదేశాల అధినేతలు హాజరయ్యారు. బెలారస్, కజకిస్థాన్, కిర్గిజిస్థాన్, తజకిస్థాన్, తుర్క్‌మెనిస్థాన్, క్యూబా, లావోస్, గినియా-బిస్సావు దేశాధినేతలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పాశ్చాత్య దేశాల ఆంక్షల నేపథ్యంలో తాము ఒంటరి కాదని, తమకు అంతర్జాతీయ మద్దతు ఉందని ప్రపంచానికి చాటిచెప్పడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశంగా స్పష్టమైంది.పుతిన్ తన ప్రసంగంలో, ఉక్రెయిన్‌పై జరుగుతున్న 'ప్రత్యేక సైనిక చర్య'ను రెండో ప్రపంచ యుద్ధంతో ముడిపెడుతూ రష్యా సార్వభౌమత్వాన్ని కాపాడుకుంటామని ఉద్ఘాటించారు. గత కొన్నేళ్లతో పోలిస్తే ఈసారి సైనిక ప్రదర్శన భారీగా సాగింది. సుమారు 11,000 మంది సైనికులు, అత్యాధునిక టీ-90ఎం ఫ్రైరీవ్, టీ-14 ఆర్మటా ట్యాంకులు, ఎస్-400 క్షిపణి వ్యవస్థలు, ఇస్కందర్-ఎం బాలిస్టిక్ క్షిపణులు, యార్స్ ఖండాంతర క్షిపణులతో పాటు, ఇరాన్ షాహెద్ డ్రోన్ల రష్యన్ వెర్షన్ అయిన 'జెరానియం-2' వంటి డ్రోన్లను కూడా ప్రదర్శించారు. చాలా మంది నేతలు నలుపు, నారింజ రంగుల సెయింట్ జార్జ్ రిబ్బన్‌ను ధరించారు, ఇది ఉక్రెయిన్ దురాక్రమణకు మద్దతు చిహ్నంగా వివాదాస్పదమైంది.ఉక్రెయిన్ యుద్ధం తీవ్రస్థాయిలో కొనసాగుతున్న వేళ జరిగిన ఈ పరేడ్‌ను, పుతిన్ రష్యా సత్తాను చాటేందుకు ఉపయోగించుకున్నారు. పరేడ్‌కు ముందు మాస్కోపై డ్రోన్ దాడులు జరిగినప్పటికీ, వేడుకలు అట్టహాసంగా సాగాయి. పుతిన్ ప్రకటించిన మూడు రోజుల ఏకపక్ష కాల్పుల విరమణను ఉక్రెయిన్ తిరస్కరించింది, ఇది పరేడ్ కోసమేనని విమర్శించింది. మరోవైపు, పశ్చిమ ఉక్రెయిన్‌లోని లీవ్‌లో పలు యూరోపియన్ దేశాల ప్రతినిధులు సమావేశమై, రష్యా దురాక్రమణ నేరాలపై ప్రత్యేక ట్రిబ్యునల్ ఏర్పాటుకు మద్దతు తెలిపారు. కొన్ని బాల్టిక్ దేశాలు రష్యా విమానాలకు గగనతలాన్ని నిరాకరించాయి.మొత్తం మీద, ఉక్రెయిన్ యుద్ధం, పాశ్చాత్య ఆంక్షల నడుమ జరిగిన ఈ విక్టరీ డే పరేడ్ ద్వారా రష్యా తన సైనిక శక్తిని ప్రదర్శించడంతో పాటు, తనకు అంతర్జాతీయ మద్దతు ఉందని ప్రపంచానికి చాటిచెప్పే బలమైన ప్రయత్నం చేసింది.

# ఐపీఎల్ వాయిదా.. టిక్కెట్ల డబ్బులు రీఫండ్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ప్రస్తుత సీజన్‌లోని మిగిలిన మ్యాచ్‌లను వారం రోజుల పాటు వాయిదా వేస్తున్నట్లు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ప్రకటించింది. భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు, ఆటగాళ్ల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు బీసీసీఐ వర్గాలు స్పష్టం చేశాయి.దేశంలో నెలకొన్న సున్నితమైన పరిస్థితుల నేపథ్యంలో క్రికెట్ మ్యాచ్‌ల నిర్వహణ శ్రేయస్కరం కాదని బీసీసీఐ భావించింది. ఈ క్రమంలోనే, మే 8న ధర్మశాల వేదికగా పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్‌ను భద్రతా కారణాల దృష్ట్యా మధ్యలోనే నిలిపివేయాల్సి వచ్చింది. వాస్తవానికి, ఈ రోజు లక్నో సూపర్ జెయింట్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది.అయితే, బీసీసీఐ తాజా ఆదేశాలతో నేటి నుంచి ఐపీఎల్ మ్యాచ్‌లన్నీ తాత్కాలికంగా నిలిచిపోయాయి. ఈ నిర్ణయంతో నేటి నుంచి జరగాల్సిన అన్ని ఐపీఎల్ పోటీలు వాయిదా పడ్డాయి. ఈ అనూహ్య పరిణామం నేపథ్యంలో, ఇప్పటికే టికెట్లు కొనుగోలు చేసిన అభిమానులకు ఆయా ఫ్రాంచైజీలు డబ్బులను తిరిగి చెల్లించే ప్రక్రియను ప్రారంభించాయి.ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, మే 10వ తేదీన హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో కోల్‌కతా నైట్ రైడర్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య కీలక మ్యాచ్ జరగాల్సి ఉంది. బీసీసీఐ తీసుకున్న వాయిదా నిర్ణయంతో ఈ మ్యాచ్ కూడా రద్దయింది. దీంతో, సన్‌రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యం టికెట్లు బుక్ చేసుకున్న అభిమానులకు రీఫండ్ ప్రక్రియను చేపట్టింది.

# వేడెక్కని ల్యాప్ టాప్ తీసుకువచ్చిన లెనోవో!

ప్రముఖ టెక్నాలజీ సంస్థ లెనోవో, గేమింగ్ ప్రియుల కోసం తన సరికొత్త ఆవిష్కరణను మార్కెట్లోకి తీసుకువచ్చింది. షాంఘైలో గురువారం జరిగిన టెక్ వరల్డ్ 2025 ఈవెంట్‌లో 'లెనోవో లీజియన్ 9ఐ' పేరుతో శక్తివంతమైన గేమింగ్ ల్యాప్‌టాప్‌ను ఆవిష్కరించింది. అత్యాధునిక ఫీచర్లు, అద్భుతమైన పనితీరుతో ఈ ల్యాప్‌టాప్ గేమింగ్ అనుభూతిని మరో స్థాయికి తీసుకెళుతుందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఇది వేడెక్కదని చెప్పారు.శక్తివంతమైన ప్రాసెసర్ మరియు గ్రాఫిక్స్: ఈ ల్యాప్‌టాప్ ఇంటెల్ కోర్ అల్ట్రా 9 చిప్‌సెట్‌తో పనిచేస్తుంది. దీనికి తోడుగా డీడీఆర్5 ర్యామ్, పీసీఐఈ జెన్ 5 ఎస్ఎస్‌డీని అమర్చారు. వినియోగదారులు గరిష్టంగా జీఫోర్స్ ఆర్‌టీఎక్స్ 5090 ల్యాప్‌టాప్ జీపీయూ వరకు కాన్ఫిగర్ చేసుకోవచ్చు. ప్రాసెసర్, జీపీయూ కలిసి మొత్తం 280%ఔ% పవర్‌ను అందించగలవని కంపెనీ తెలిపింది. దీంతో అత్యంత భారీ గ్రాఫిక్స్ కలిగిన గేమ్‌లను కూడా సులభంగా ఆడవచ్చు.అద్భుతమైన డిస్‌ప్లే: లెనోవో లీజియన్ 9ఐ 18 అంగుళాల ప్యూర్‌సైట్ స్క్రీన్‌తో వస్తుంది. ఇది 2%ఐ%లో 4%ఖ (3,840 ఇ% 2,400 పిక్సెల్స్) రిజల్యూషన్‌ను, 240%ఎఓ% రిఫ్రెష్ రేట్‌ను సపోర్ట్ చేస్తుంది. ఐచ్ఛికంగా 2%ఖ 3ఐ (1,920 ఇ% 1,200 పిక్సెల్స్) సపోర్ట్‌తో కూడిన వేరియంట్ కూడా అందుబాటులో ఉంది. ఈ డిస్‌ప్లే 540 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్, 100 శాతం డీసీఐ-పీ3 కలర్ గామట్ కవరేజ్‌ను కలిగి ఉంది. వీఈఎస్ఏ డిస్‌ప్లేహెచ్‌డీఆర్ 400, టీయూవీ రైన్‌ల్యాండ్, డాల్బీ విజన్ సర్టిఫికేషన్లతో పాటు ఎన్విడియా జీ-సింక్ సపోర్ట్‌ను కూడా అందిస్తుంది.సమర్థవంతమైన కూలింగ్ సిస్టమ్: అధిక ఉష్ణోగ్రతలను సమర్థవంతంగా తగ్గించడానికి లెనోవో లీజియన్ 9ఐలో 'లెజియన్ కోల్డ్‌ఫ్రంట్ వేపర్' థర్మల్ సిస్టమ్‌ను అమర్చారు. ఇందులో వేపర్ ఛాంబర్, హైపర్ ఛాంబర్, క్వాడ్ ఫ్యాన్ సిస్టమ్ ఉన్నాయి. వై-ఫై కార్డ్, ఎస్ఎస్‌డీ, ర్యామ్ కోసం ప్రత్యేక ఫ్యాన్‌లు ఉన్నాయని, గ్రాఫికల్‌గా డిమాండ్ ఉన్న పనుల సమయంలో కూడా వేడిని సమర్థవంతంగా అదుపు చేస్తుందని లెనోవో పేర్కొంది. 280%ఔ% పర్ఫార్మెన్స్ మోడ్‌లో కూడా ల్యాప్‌టాప్ 48%ఎదీ% కంటే తక్కువ శబ్దం చేస్తుందని కంపెనీ హామీ ఇచ్చింది.స్టోరేజ్ మరియు ర్యామ్ సామర్థ్యం: ఈ గేమింగ్ ల్యాప్‌టాప్ ఇంటెల్ కోర్ అల్ట్రా 9 275%ఎశ% ప్రాసెసర్‌తో పాటు, గరిష్టంగా 64%+దీ% డ్యూయల్ ఛానల్ డీడీఆర్5 ర్యామ్, 2%దీ% వరకు పీసీఐఈ జెన్5 ఎస్ఎస్‌డీ స్టోరేజ్‌తో వస్తుంది. అవసరమైతే ర్యామ్‌ను 192%+దీ% వరకు, స్టోరేజ్‌ను 8%+దీ% వరకు విస్తరించుకునే సౌలభ్యం ఉంది. ఇది విండోస్ 11 ప్రో వరకు ఆపరేటింగ్ సిస్టమ్‌పై నడుస్తుంది.ఏఐ ఆధారిత ఫీచర్లు: లెనోవో లీజియన్ 9ఐలో లెనోవో ఏఐ కోర్ చిప్, లెనోవో ఏఐ ఇంజిన్‌ం ఉన్నాయి. ఇవి యూజర్ వినియోఖతీఅశీ% ఆధారంగా సెట్టింగ్‌లను సర్దుబాటు చేసి, గేమింగ్, రెండరింగ్ వంటి పనుల సమయంలో గరిష్ట పనితీరును అందిస్తాయి. లెనోవో లీజియన్ స్పేస్ ఫీచర్, ఏఐ సహాయంతో ఇన్-గేమ్ సౌండ్, ఆన్-స్క్రీన్ విజువల్స్‌కు అనుగుణంగా ల్యాప్‌టాప్ ఆర్‌జీబీని సింక్ చేస్తుంది. దీనికి ఆరు-స్పీకర్ల సౌండ్ సిస్టమ్, నహిమిక్ ఆడియో తోడ్పడతాయి. కోచ్, గేమ్ క్లిప్ మాస్టర్, గేమ్ కంపానియన్ వంటి అనేక సాఫ్ట్‌వేర్ ఆధారిత ఏఐ-పవర్డ్ గేమింగ్ ఫీచర్లు కూడా ఇందులో ఉన్నాయి.కనెక్టివిటీ మరియు ఇతర ఫీచర్లు: కనెక్టివిటీ విషయానికొస్తే, ఇందులో యూఎస్‌బీ టైప్ ఏ (యూఎస్‌బీ 3.2 జెన్ 2, ఆల్వేస్ ఆన్ యూఎస్‌బీ 5%ఎ2ూూ%), ఆర్జే45, రెండు థండర్‌బోల్ట్ 5 పోర్టులు (120%+ఎజూం% వరకు, డిస్‌ప్లేపోర్ట్ 2.1, పవర్ డెలివరీ 3.0 140%ఔ%), ఆడియో కాంబో జాక్ ఉన్నాయి. కుడి వైపున రెండు యూఎస్‌బీ టైప్ ఏ (యూఎస్‌బీ 3.2 జెన్ 2), ఒక యూఎస్‌బీ టైప్ సీ (యూఎస్‌బీ 3.2 జెన్ 2), ఈషటర్ బటన్, ఎస్‌డీ కార్డ్ రీడర్ 4.0 వంటివి అందించారు. ఈ ల్యాప్‌టాప్‌లో ఫోర్జ్‌డ్ కార్బన్ మూత, 1.6%ఎఎ% ట్రావెల్‌తో కూడిన ఆర్‌జీబీ కీబోర్డ్ ఉన్నాయి. ఇందులో %ఔూూణ% స్విచ్చబుల్ సెట్ కూడా ఉంది. లెనోవో లీజియన్ 9ఐ గరిష్టంగా 99.99%ఔష్ట్ర% బ్యాటరీని కలిగి ఉండి, 400%ఔ% పవర్ అడాప్టర్‌తో వస్తుంది.ధర మరియు లభ్యత: ధర విషయానికొస్తే, లెనోవో లీజియన్ 9ఐ ప్రారంభ ధర 4,499 యూరోలు (సుమారు రూ. 4,32,000)గా నిర్ణయించారు. ఇది కార్బన్ బ్లాక్ కలర్‌వేలో లభిస్తుంది. యూరప్‌లో జూన్ 2025 నుంచి, ఉత్తర అమెరికాలో ఈ ఏడాది నాలుగో త్రైమాసికం (%ూ%4) నుంచి కొనుగోలుకు అందుబాటులో ఉంటుంది. అమెరికాలో దీని ధరను కంపెనీ ఇంకా వెల్లడించలేదు. ఈ ల్యాప్‌టాప్ కొనుగోలుతో మూడు నెలల పాటు కాంప్లిమెంటరీ ఎక్స్‌బాక్స్ గేమ్ పాస్ సబ్‌స్క్రిప్షన్ లభిస్తుంది.

# శంషాబాద్ విమానాశ్రయానికి బాంబు బెదిరింపు

హైదరాబాద్‌లోని శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కలకలం రేగింది. విమానాశ్రయంలో బాంబు అమర్చినట్లు గుర్తుతెలియని వ్యక్తుల నుంచి అధికారులకు ఈ-మెయిల్ ద్వారా బెదిరింపు సందేశం అందింది. ఈ సమాచారంతో అప్రమత్తమైన విమానాశ్రయ అధికారులు, భద్రతా సిబ్బంది వెంటనే తనిఖీలు చేపట్టారు.బాంబు బెదిరింపు ఈ-మెయిల్ అందిన వెంటనే, శంషాబాద్ విమానాశ్రయ అధికారులు పోలీసులకు, కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్)కు సమాచారం అందించారు. దీంతో పోలీసులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది అప్రమత్తమై, హుటాహుటిన రంగంలోకి దిగారు. డాగ్ స్క్వాడ్, బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్ బృందాలను రప్పించి విమానాశ్రయ ప్రాంగణమంతా విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికుల రాకపోకలు, లగేజీ స్కానింగ్ పాయింట్లు, పార్కింగ్ ప్రదేశాలు సహా కీలకమైన అన్ని ప్రాంతాల్లోనూ క్షుణ్ణంగా సోదాలు నిర్వహించారు.అయితే, ఈ బెదిరింపు ఈ-మెయిల్ నిజమైనదా లేక కేవలం ఆకతాయిల చర్యా అనే కోణంలో అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ-మెయిల్ ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరు పంపారు? అనే వివరాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. భారత్-పాకిస్థాన్ సరిహద్దుల్లో నెలకొన్న తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో శంషాబాద్ విమానాశ్రయంలో భద్రతను ఇప్పటికే కట్టుదిట్టం చేశారు.

## తన కొత్త సినిమా ఆడియో ఫంక్షన్ వాయిదా వేసుకున్న కమల్ హాసన్

దేశంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు, పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో తమిళనాడులో ప్రముఖులు సైనికులకు సంఘీభావం ప్రకటిస్తున్నారు. నటుడు కమల్ హాసన్ తన సినిమా కార్యక్రమాన్ని వాయిదా వేయగా, ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్, ప్రతిపక్ష నేత పళనిస్వామి కీలక పిలుపునిచ్చారు.ప్రముఖ నటుడు కమల్ హాసన్ తన ప్రతిష్ఠాత్మక చిత్రం 'థగ్ లైఫ్' ఆడియో విడుదల కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు తాజాగా ప్రకటించారు. మణిరత్నం దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా ఆడియో వేడుక మే 16న జరగాల్సి ఉండగా, దేశంలో నెలకొన్న అప్రమత్తత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. "మన మాతృభూమి రక్షణ కోసం సైనికులు సరిహద్దుల్లో అచంచలమైన ధైర్యంతో నిలబడినప్పుడు, ఇది వేడుకల సమయం కాదని, మౌనంగా సంఘీభావం తెలపాల్సిన సమయమని నేను నమ్ముతున్నాను" అని కమల్ హాసన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. "పౌరులుగా, సంయమనంతో, సంఘీభావంతో స్పందించడం మన కర్తవ్యం" అని ఆయన అన్నారు. సినిమా ఆడియో విడుదల కొత్త తేదీని త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.సీఎం స్టాలిన్ సంఘీభావ యాత్రకు పిలుపు, విద్యార్థుల భద్రతపై హామీతమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ సైనికులకు సంఘీభావం తెలుపుతూ రేపు (గురువారం) చెన్నైలో భారీ మార్చ్ నిర్వహించాలని పిలుపునిచ్చారు. మెరీనా వద్ద డీజీపీ కార్యాలయం నుంచి ఐలాండ్ గ్రౌండ్ వరకు ఈ యాత్ర సాగనుంది. మంత్రులు, మాజీ సైనికోద్యోగులు, విద్యార్థులు ఈ యాత్రలో పాల్గొననున్నారు.కశ్మీర్‌లో చదువుతున్న 52 మంది తమిళనాడు విద్యార్థులు, పర్యటనకు వెళ్లిన మరో నలుగురు విద్యార్థుల భద్రతపై తల్లిదండ్రులు వ్యక్తం చేసిన ఆందోళనల నేపథ్యంలో, ప్రభుత్వం వారి భద్రతకు అన్ని చర్యలూ తీసుకుందని స్టాలిన్ హామీ ఇచ్చారు. కేంద్రపాలిత ప్రాంత అధికారులతో మాట్లాడుతున్నామని, పరిస్థితులు చక్కబడ్డాక వారిని చెన్నైకి విమానంలో తీసుకువస్తామని తెలిపారు. ఇప్పటికే రోడ్డు మార్గంలో ప్రయాణిస్తున్న నలుగురు విద్యార్థులు ఈ రాత్రికి ఢిల్లీ చేరుకుని, రేపు ఉదయం స్వస్థలాలకు తిరిగి రానున్నారని ఆయన వివరించారు.

## విదేశీ మహిళా టూరిస్టును ఆకట్టుకున్న ఢిల్లీ ఆటోడ్రైవర్ మంచి మనసు

ఢిల్లీలో ఓ ఆటో డ్రైవర్ మంచి మనసుకు, ఓ విదేశీ మహిళ చూపిన కృతజ్ఞతకు సంబంధించిన ఓ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ హృద్యమైన సంఘటన నెటిజన్ల మనసులను గెలుచుకుంటోంది. మానవత్వపు విలువలు ఇంకా బ్రతికే ఉన్నాయని నిరూపిస్తోంది.వివరాల్లోకి వెళితే, తారా ఇంగ్రామ్ అనే విదేశీ మహిళ ఢిల్లీలో ఆటోలో ప్రయాణించింది. గమ్యస్థానం చేరిన తర్వాత, ఛార్జీ చెల్లించేందుకు గాను, చిల్లర ఉందా మీ దగ్గర? అని ఆటో డ్రైవర్‌ను అడిగింది. అయితే, ఆ ఆటో డ్రైవర్ ఊహించని విధంగా డబ్బులు తీసుకోవడానికి నిరాకరించాడు. "పర్లేదు మేడమ్, మీరు వెళ్లండి" అంటూ హిందీలో సమాధానమిచ్చాడు. ఆమె అయోమయానికి గురికావడం గమనించి, "డోంట్ వర్రీ.. మీరు ఛార్జి ఇవ్వనవసరం లేదు" అని భరోసా ఇచ్చాడు.ఆటో డ్రైవర్ ఉదారతకు తారా ఆశ్చర్యపోయింది. "నిజంగానా?" అని అడగ్గా, ఆ సమయంలో అక్కడే ఉన్న ఓ బాటసారి జోక్యం చేసుకుని, "అవును మేడమ్" అని బదులిచ్చాడు. డ్రైవర్ దయ, నిజాయతీ తనను ఎంతగానో కదిలించాయని, ప్రతిగా తాను కూడా ఏదైనా చేయాలనుకుంటున్నానని తారా ఆ బాటసారితో చెప్పి, తన మాటలను డ్రైవర్‌కు అనువదించమని కోరింది. "ఆయన చాలా చాలా మంచివారు. ఆయన మంచితనానికి నేను ఏదైనా చేయాలనుకుంటున్నాను. ఆయనకు నేను కొంత డబ్బు ఇస్తాను" అని ఆమె చెప్పింది. ఈ క్రమంలోనే, ఆమె కృతజ్ఞతగా రూ.2000 ఆటో డ్రైవర్‌కు ఇవ్వజూపింది.తారా మాటలను ఆ బాటసారి ఆటో డ్రైవర్‌కు వివరించాడు. ఆమె నీకు డబ్బు ఇస్తానంటోంది అని చెప్పాడు. దాంతో, ఆ ఆటోడ్రైవర్ చిరునవ్వుతో ఆమె ఇచ్చిన రూ.2 వేలను స్వీకరించాడు. తనకు నలుగురు పిల్లలున్నారని డ్రైవర్ ఆమెకు తెలిపాడు. "మీ కుటుంబం చల్లగా ఉండాలి" అని తారా పేర్కొంది.ఈ మొత్తం సంభాషణను తారా ఇంగ్రామ్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పంచుకోగా, అది క్షణాల్లో వైరల్‌గా మారింది. ఈ వీడియోకు ఇప్పటివరకు 2.21 లక్షలకు పైగా లైకులు, 20 లక్షలకు పైగా వ్యూస్ వచ్చాయి. కామెంట్ సెక్షన్‌లో నెటిజన్లు ఆటో డ్రైవర్ నిస్వార్థాన్ని, విదేశీ మహిళ ఉదారతను ప్రశంసలతో ముంచెత్తుతున్నారు.కొంతమంది యూజర్లు, "ఆ డ్రైవర్ ఆ రోజు సంపాదన మొత్తాన్ని మీరు ఇచ్చి ఉండవచ్చు! అది మీకు పెద్ద ఆర్థిక వ్యత్యాసం కలిగించకపోవచ్చు, కానీ అతనికి చాలా తేడాను కలిగిస్తుంది!" అని వ్యాఖ్యానించారు. మరొకరు, "లక్షలాది హృదయాలను, ఆశీర్వాదాలను గెలుచుకున్నారు" అని పేర్కొన్నారు. భారతదేశంలోని మంచి విషయాలను చూపించినందుకు పలువురు తారాకు ధన్యవాదాలు తెలిపారు.